

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- అరకులోయ:స్థానికంగా దొరికే ఆకుకూరలు ఇతర కూరగాయలు, పిండి పదార్థాలు వంటి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం మెరుగు పడుతుందని అరకులోయ ఐసిడిఎస్ మాడగడ సెక్టార్ సూపర్వైజర్ పార్వతి అన్నారు. బుధవారం మాడగడ సెక్టార్ పరిధిలోని వివిధ అంగన్వాడి సెంటర్లకు సంబంధించిన అంగన్వాడి కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీలతో కలిసి మాడగడ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ, గిరిజన సాంప్రదాయ వంటకాలు తీసుకోవడంతో మంచి ఆరోగ్యం కలుగు తుందన్నారు. రాగి, సామలు, ఆకుకూరలు, రాజ్మా, చిక్కుళ్ళు వంటివి వాడకంతో పాటు అంగన్వాడి సెంటర్లో ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చునన్నారు.


అవగాహన కల్పిస్తున్న పార్వతి

చిన్న తరహా పరిశ్రమల పార్కు ఏర్పాటుకు సర్వే

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: గిరిజన ఉత్పత్తులతో గ్రామీణ చిన్న తరహా పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయడానికి సమగ్రమైన సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు . బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ, వ్యవసాయ, ఉద్యాన వన, డి.ఆర్.డి.ఎ, పశు సంవర్ధక శాఖ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో పరిశ్రమల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పడానికి గల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో, కాఫీ, మిరియాలు, పైనాపిల్, సీతా ఫలాలు, అల్లం, పసుపు, చింతపండులను ఎక్కువగా రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. చింతపల్లి మండలం గొందిపాకలు ప్రాంతంలో పరిశ్రమ నెల కొల్పితే గిరిజనులకు ప్రయోజన కరగంగా ఉంటుందని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ముందుగా చింతపల్లి మండలంలో ఏర్పాటు చేయడానికి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలను పరిశ్రమ స్థాపనలో భాగ స్వామ్యం చేయాలని పేర్కొన్నారు.వచ్చేనెల 2వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని, పరిశ్రమ నెల కొల్పడానికి అవసరమై భూ సేకరణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రైతులకు, మహిళా సంఘాలకు ఆర్థికాభివృద్ధికి దోహద పడతాయని, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. వారపు సంతలలో చిన్న,చిన్న మార్పులు ఏర్పాటు చేయాలని చెప్పారు.

రూరల్ రినైసాన్స్ సంస్థ డైరెక్టర్ ప్రఖార్ అండ్లే మాట్లాడుతూ, చత్తీస్ ఘడ్‌లో ఏర్పాటు చేసిన రూరల్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాట్లపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు దోహద పడుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన చిన్న తరహా పరిశ్రమల గురించి వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీవాణిధర్ రామన్, సహాయ సంచాలకులు ఎం. నవీన్ కుమార్, డి.ఆర్. డి. ఏ. పి. డి. వి.మురళి, జిల్లా వ్యసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, పి. హెచ్.ఓ.ఎన్. అశోక్, పి.ఐ.యు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, పశు వైద్యాధికారి రాజ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు:పాడేరులో డిగ్రీ చదువుతున్న గిరిజన విద్యార్థి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడని ఈ విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జీవన్ కృష్ణ కోరారు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం బిఎస్సి చదువుతున్న మువ్వల సూర్యం అనే విద్యార్థికి పిట్స్ రావడంతో ఆకస్మికంగా మృతి చెందాడని తెలిపారు జిల్లా కేంద్రంలోని సిల్వర్ నగర్‌లో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ ఈ విద్యార్థి చదువుకుంటున్నాడని చెప్పారు విద్యార్థి కుటుంబానికి 10లక్షల ఎక్స్ గ్రేసియా ఇచ్చి వారి కుటుంబన్ని ఆదుకోవాలన్నారు.హాస్టల్స్ లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, హెల్త్ వాలంటరీ నియమించాలని డిమాండ్ చేశారు.గిరిజన విద్యార్థుల మృతి పట్ల టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహర్సిస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో రోజురోజుకు విద్యార్థులు చనిపోతున్నా కనీసం విచారణ చేయడానికి కూడా అధికారులకు, ప్రభుత్వనికి పట్టడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పి. సింహాద్రి, మండల నాయకులు పి.గోపాల్, వి,విష్ణు, కె. రవి తదితరులు పాల్గొన్నారు..

విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలి

పాడేరు: గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్న పడాల్ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి పాడేరులో మరణించిన డిగ్రీ విద్యార్థి మువ్వల సూర్యం స్వగ్రామమైన పెద్దబయలు మండలం బొంగరం పంచాయతీ పోతులుగరువు గ్రామంలో విద్యార్థి సూర్యం మృతదేహానికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. సూర్యం తండ్రి అప్పారావుతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ధర్మన్న పడాల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల మరణాలు ఎక్కువ అయ్యాయని. వీటిపై సమగ్రమైన విచారణ జరిపి అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి -పాడేరు: డిసెంబర్ 24న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు అక్టోబర్ మూడవ తేదీ వరకు గడువు పొడిగించింట్లు జిల్లా విదాశాఖాదికారి పి. బ్రహ్మాజీ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయపు వెబ్సైటులో అందుబాటు లో ఉంచామని తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్బిఐ కలెక్ట్ రసీదులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం (పాడేరు)లో అక్టోబర్ 14వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. నమోదు చేసే సమయములో విద్యార్థి ఆధార్ కార్డ్‌లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు నమోదు చేయాలన్నారు. ధరఖాస్తు చేసుకునేందుకు ధ్రువపత్రాలు అవసరం లేనప్పటికీ, పరీక్ష రాసే సమయమునకు అన్ని ధ్రువపత్రములు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుము ఓ.సి., బి.సి. విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్ సైట్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకు నియోజక వర్గస్థాయి క్రీడా పోటీల ఎంపికలు బుధవారం ముగిశాయి. రెండు రోజుల పాటు అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ క్రీడా మైదానంలో నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. మొదటి రోజు బాలికల క్రీడా పోటీలు ఆరు మండలాల వివిధ పాఠశాలల నుండి అండర్- 14 ,17 విభాగంలో వాలీబాల్, కబడ్డి, యోగా, ,షటిల్ ఎంపికలు జరిగాయి. ఇందులో భాగంగా అండర్ 14 విభాగంలో 306 మంది, 17 విభాగంలో 306 మంది మొత్తం 612 పాల్గొన్నారు. రెండవ రోజు బాలుర విభాగంలో 612 పాల్గొన్నారు. ఇందులో సెలక్షన్ అయిన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే క్రీడలో పాల్గొంటారని అల్లూరి సీతారామరాజు జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ కొండబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

వెంకట రమేష్ నాయుడుకు చైర్మన్ పదవి ఇవ్వాలి

- టిడిపి నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-జి.మాడుగుల: నందమూరి తారక రామారావు పార్టీ పెట్టినప్పటి నుంచి పాడేరు నియోజకవర్గంలో కిలో వెంకట రమేష్ నాయుడు ప్రెసిడెంట్, ఎంపిటిసి, వైస్ ఎంపిపి పదవులు చేపడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని, ఆయకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లేదా పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి నిర్ణయంతోనే ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఆయన అధిష్టానం నిర్ణయం మేరకు విత్ డ్రా చేసుకున్నారని తెలిపారు. టికెట్ త్యాగం చేసిన అభ్యర్థులకు అధిష్టానం కచ్చితంగా న్యాయం చేస్తామని చెప్పిందని, ఈ మేరకు ఆయనకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలమామిడి పంచాయతీ ఎంపీటీసీ గెమ్మెలి అప్పారావు, కొరపల్లి పంచాయతీ మాజీ ఎంపీటీసీ చిన్నకొండబాబు, మాజీ సర్పంచ్ పాలసీ రామన్నదొర, టీడీపీ సీనియర్ నాయకులు లకే బాలయ్యదొర, కొండపల్లి పిన్నయ్య, టీడీపీ గెమ్మెలి పంచాయతీ అధ్యక్షులు మాతే లక్ష్మణ్‌రావు, యూనిట్ ఇంచార్జి సెగే కొండలరావు, జీ.మాడుగుల యూనిట్ ఇంచార్జి మత్స్యరాస నారాయణ రాజు, తెలుగు యువత ఉపాధ్యక్షులు సత్యనారాయణ, టి.ఎన్.ఎస్.ఎఫ్ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి త్రినాధ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

అక్రమ నిర్మాణాలపై ర్యాలీ

ప్రజాశక్తి-అరకులోయ:ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరు లు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు తక్షణమే కూల్చి వేయాలని జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర మాట్లాడుతూ, 1/70 చట్టం అమల్లో ఉండగా గిరిజనేతరులు ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శిం చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్ గోపాల్, ప్రధాన కార్యదర్శి శెట్టి అశోక్ కుమార్, కార్యదర్శి మహదేవ్, సంయుక్త కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

ఎస్ఐ షణ్ముఖరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల :స్థానిక పోలీస్ స్టేషన్లో మన్యం జిల్లా కురుపాం నుండి బదిలీపై వచ్చిన ఎస్ఐ షణ్ముఖరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ట్రాఫిక్ నియంత్రపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.



సమస్యలపై వెలుగు విఓఎల ధర్నా

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలో నాలుగు మండలాల్లో ఉన్న విఓఎల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఐటిడిఎ వద్ద ఆందోళన చేశారు ఈ సందర్భంగా రంపచోడవరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒక తీరు ఉంటే, నాలుగు విలీన మండలాల్లో వెలుగు విఓఎలకు వేతనాలు సక్రమంగా అందడం లేదన్నారు.

వెలుగు విఓఎల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్కులర్ ను రద్దు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గ్రామ సంఘాల నుండి ఇవ్వాల్సిన రూ.2000 రూపాయలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగు మండలాల్లోని వెలుగు సిసిలు, ఎపిఎంలతో ఐటిడిఎ ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఈసందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్‌స్టాండ్ నుంచి ఐటిడిఎ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఐటిడిఎ వద్ద ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడినటువంటి వినతిపత్రాన్ని నాలుగు మండలాల స్పెషలాఫీసర్ అంబేద్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్. సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, విఓఎల యూనియన్ జిల్లా అధ్యక్షులు గొర్రె లక్ష్మయ్య, నాయకులు రాము, సుందరి, దుల్లమ్మ, లీలావతి, రత్నకుమారి, శిరీష, కొండ పాల్గొన్నారు.



ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న వెలుగు విఓఎలు

పంపు స్టోరేజీ ప్రాజెక్టుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న సిసిఎఫ్ కంతనాధరెడ్డి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టు స్థాపనకు అవసరమైన అటవీశాఖ అనుమతులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రాజెక్టుకు అటవీశాఖఅనుమతులు పూర్తిస్థాయిలో మంజూరు కానున్నాయని విశాఖ అటవీశాఖ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ కంతనాధరెడ్డి వెల్లడించారు. బుధవారం సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పే పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు అటవీ అనుమతులపై రిజర్వ్ ఫారెస్ట్‌ను పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు నాలుగు బిట్లలో 193హెక్టార్ల అటవీభూమి జెన్‌కోకు అవసరం.

ఈ సందర్భంగా స్థానిక అటవీశాఖ టింబర్ డిపోలో విలేకరులతో మాట్లాడుతూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. s పంపు స్టోరేజ్ ప్రాజెక్టు పూర్తిగా పర్యావరణానికి అనుకూలమైనదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే సరిహద్దులు గుర్తింపు, ఎసెస్‌మెంట్ సర్వే పూర్తి చేశామన్నారు. పార్వతీ నగర్ శాండికోరి, జొన్న మామిడి, చర్చి వెనుక భాగంలో వేసిన ప్రాజెక్టు సర్వే రాళ్లను పరిశీలించమన్నారు.. చేపట్టిన సర్వే సక్రమంగా ఉన్నదీ లేనిదీ నిర్ధారణకు తాను పరిశీలనకు వచ్చానన్నారు. నివేదికను పిసిసిఎఫ్ అందజేస్తామని, తర్వాత రాష్ట్ర స్థాయి నుంచి ఒక అధికారి వచ్చి మరొకసారి ప్రాజెక్టును పరిశీలించి నివేదికను కేంద్ర అటవీశాఖ అనుమతుల కోసం నివేదిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని త్వరలోనే పంపు స్టోరేజ్ ప్రాజెక్టు పట్టాలెక్కించేందుకు చర్యలు వేగవంతం చేస్తుందన్నారు.

విశాఖ సర్కిల్‌లో ఏకో టూరిజం అభివృద్ధికి చర్యలు

విశాఖ సర్కిల్ పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అల్లూరి జిల్లా అరుకు ఫారెస్ట్ కాంప్లెక్స్, అరుకు పైనరీలతోపాటు పార్వతీపురంలో సున్నపు గెడ్డ జలపాతాల వద్ద, విజయనగరం సారిపల్లి బేతనపల్లి ఏకో టూరిజం ప్రాజెక్టులు ఇప్పటికే వినియోగంలోకి వచ్చాయని వెల్లడించారు. చింతపల్లి డివిజన్ పరిధిలోని లంబసింగి వద్ద కృష్ణాపురం ఏకో టూరిజం ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. విజయనగరం జిల్లా వెలగాల వద్ద కూడా ఒక రిజర్వ్ ఫారెస్ట్ ఉందని అక్కడే ఏకో టూరిజం ఏర్పాటుకు ఇటీవల అనుమతులు వచ్చేయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ టౌన్‌లో, అనకాపల్లి బయ్యవరం వద్ద నగరవనాలు మంజూరయ్యాయని, ఇప్పటికే విశాఖపట్నంలో నగర వనం అందుబాటులో ఉందన్నారు. ఎన్ఆర్‌జిఎస్ ద్వారా విశాఖ సర్కిల్ పరిధిలో 75 లక్షల మొక్కలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకుప్రణాళికలు రూపొందించామన్నారు .కార్యక్రమంలో డి ఎఫ్ ఓ సూర్యనారాయణ పడాల్ సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి ఎస్ ఈ సివిల్ రాంబద్ర రాజు ఏడిఈటి అప్పలనాయుడు ఎఇ సురేష్ పాల్గొన్నారు.

గిరిజనులకు బైండోవర్ నోటీసులు దారుణం

ప్రజాశక్తి - ఎటపాక : ఏజెన్సీలో గిరిజనులకు ఎటపాక మండల తహశీల్దార్ బైండోవర్ నోటీసులు ఇవ్వడం దారుణమని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కాకా అర్జున్‌దొర, ఇరప అజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బుధవారం ఐటిడిఎ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ, ప్రయివేటు ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని గిరిజన, గిరిజనేతరుల మధ్య వివాదాలకు కారణమౌతున్నారని, మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని పేర్కొంటూ బుధవారం తహశీల్దార్ కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని కొందరు గిరిజనులకు స్థానిక తహశీల్దార్ నోటీసులు ఇచ్చారు. రూ.60వేలు, ఇద్దరు పూచీకత్తుతో, ఆరునెలల బైండోవర్ చేయడంపై ఆదివాసీ గిరిజన సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాజకీయ ప్రోద్భలంతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ గిరిజనులకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. దశాబ్దాలుగా గిరిజన, గిరిజనేతరుల మధ్య వివాదాలు లేవని, సామరస్యంగా మెలుగుతున్న వారి మధ్య కొందరు వైషమ్యాలు సష్టించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గిరిజనులకు బైండోవర్ నోటీసులపై న్యాయ పోరాటం చేస్తామని, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ, రాష్ట్ర ట్రైబల్ కమిషన్లకు, జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తున్నామన్నారు.

ఐటిడిఎలో వినతిపత్రం అందించిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం ఎటపాక మండల నాయకులు సోందె రామారావు, కురసం రాజశేఖర్, తెల్లం నవీన్, సున్నం రామకష్ణ, తెల్లం చిన్న నారాయణ, నల్లకుంట ఉపసర్పంచ్ గుండికోటేశ్వరరావు వున్నారు.


ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు,

రైతులకు రాయితీపై అపరాల విత్తనాలు


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో బుధవారం గిరిజన రైతులకు 90శాతం రాయితీపై మినుము, పెసర విత్తనాలను ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నాలుగు కిలోల విత్తనాలను రాయితీ పోను రూ.85లకే పొందవచ్చని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరదల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వడ్ల రమేష్, పంచాయతీ సెక్రెటరీ తాతారావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టాల అంచనాలో నిర్లక్ష్యం

వర్షం, వరదల విలయ బాధితుల ఆవేదన


వరద విలయంతో మేటలు వేసిన పంట పొలాలు

ప్రజాశక్తి -సీలేరు: వర్షం, కొండచరియల విలయంలో ఇళ్లు, పంటభూములు సర్వం కోల్పోయిన తమవైపు అధికారులెవరూ కన్నెత్తి చూడడం లేదనిజీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసపల్లి, మనసపల్లి, వలసగడ్డ కొత్తూరు, శాండికొరి, బూషి కొండ గ్రామాల బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల వరదలకు పంట పొలాలు పూర్తిగా కొట్టుకుపోయి తీవ్రంగా నష్టం వాటిల్లింది.

వరదలు వచ్చి 15 రోజులు గడుస్తున్నా తమను ఆదుకునే చర్యలు గానీ, పంటనష్టాల అంచనాకు గానీ ఎవరూ రాలేదని ఆవేదన చెందుతున్నారు. తమపట్ల రెవెన్యూ అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్ స్పందించి తమ గ్రామాల్లో పంట, ఇతర ఆస్తి నష్టాలను అంచనా వేయించి తగు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని బాధితులు కిముడు. శిబో, మజ్జిగ గెన్ను, జిన్ని రాజారావు వేడుకుంటున్నారు.


ఆవేదన వ్యక్తంచేస్తున్న వర్షవిలయ బాధితులు



పొలం పిలుస్తోందిలో వ్యవసాయాధికారి నీలవేణి తదితరులు

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అరకు, కురిడి పంచాయతీ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి నీలవేణి మాట్లాడుతూ, ప్రతి ఒక్క రైతు ఈ కేవైసీ, ఈ క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు వర్తిస్తాయని చెప్పారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వ రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలతో పాటు మూగజీవులకు వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఏ రమేష్, ఎంపీఈఓ దేవి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ పలవలస, సారవనిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరి తెలిపారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించే రాయితీలు రైతులు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి శిరీష్, పశు వైద్యులు జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కన్నంపేట, కొమ్మిక రైతులతో బుధవారం పొలం పిలుస్తోంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఉమాదేవి మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లో వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అగ్గి తెగులు, ఆకు ముడత తెగులు ఉందని గుర్తించామని, వాటి నివారణకు తగు చర్యలు చేపట్టాలని రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీవరసాయన ప్రభుత్వపరంగా క్రిమి సంహారకాలను అందజేయాలని, జీవీపీఎల [illegible] కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, పశువ్యాధులపై సూచనలు చేశారు. మత్స్యశాఖ అసిస్టెంట్ కుమారి సంబంధిత శాఖ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ఎంపిటిసిలు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, విహెచ్ఎలు సుబ్బారావు ,పెంటన్న పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న వైస్ సర్పంచ్ కిల్లో రామారావు

రైతులకు పొజిషన్స్ సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయితీ లో బుదవారం ఐటిడిఏ కాఫీ బోర్డు ఆధ్వర్యంలో ముల్లుమెట్ట గ్రామంలో కాఫీ, మిరియాలు పంటలు పండిస్తున్న రైతులకు పొజిషన్స్ సర్టిఫికెట్ తడిగిరి పంచాయతీ వైస్ సర్పంచ్ కీల్లో రామారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో భారీ కొండచిలువ

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగర్‌నగర్‌లోని హర్షటవర్ అపార్టుమెంట్‌ను ఆనుకొని ఉన్న ఆట మైదానంలోని నెట్‌లో ఒక భారీ కొండ చిలువ తల భాగం చిక్కుకొని కదలేని పరిస్థితిలో ఉంది. నివాసులు చూసి భయపడి స్నేక్ క్యాచర్ కిరణ్ కుమార్‌కు సమాచారం అందించారు. కిరణ్ వచ్చి చాకచక్యంగా కొండ చిలువను పట్టుకున్నాడు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. బుధవారం ఐటిడిఎ సమావేశమందిరంలో ఎటిడబ్ల్యుఒలు, హెచ్ఎంలు, గురుకులాల ప్రిన్సిపల్స్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా పిఒ మాట్లాడుతూ. ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, విద్యార్థులకు అనారోగ్యంగా ఉంటే వెంటనే ఆస్పత్రులు జాయిన్ చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆశ్రమ పాఠశాలల లోపలికి ఇతరులను అనుమతించరాదని సూచించారు. గిరిజన సంక్షేమ పాఠశాలలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ. కొండలరావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలలో ప్రతి నెల మూడో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే విధంగా ఒక గ్రూపు ఏర్పాటు చేస్తామన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒలు రామ తులసి, కృష్ణమోహన్, సూపరింటెండెంట్ బి. కిషోర్,హెచ్ఎంలు బి ఎస్ కుమార్, బి. నాగేశ్వరరావు, రామారావు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్,పి. భీమిరెడ్డి,నాగేంద్ర, పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న కుటుంబాలకు వందరోజుల పని

రంపచోడవరం: ఉపాధి జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటిడిఎ సమావేశమందిరంలో ఉపాధి హామీ పథకం ఎపిడితో, పిఎఒలు, ఎపిఒలతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా పనుల గుర్తింపునకు గ్రామసభలు తీర్మానాలతో నివేదికల సమర్పించాలన్నారు. మండలాల వారిగా పనులపై ఆరా తీశారు. ఉపాధి పనులు వివరాలు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. .కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు,పిఎఒ యల్.రాంబాబు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు సత్యనారాయణ, సాయిబాబా ప్రకాష్, సురేష్, స్వామి, రెడ్డి బాబు, మణి కుమారి, అరవాలు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ సింహాచలం



మాట్లాడుతున్న పిఒ సింహాచలం

నేరాలు ఘోరాలు

కత్తితో భార్యా భర్తలపై దాడి

- భార్య మృతి

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ పంచాయతీ శివారు గ్రామం శ్రీరాంపురం గ్రామంలో చిటికెల తాతీలు అనే వ్యక్తి ఆయన కుటుంబ సభ్యులైన చిటికెల అబ్బులు, ఆయన భార్య వరలక్ష్మీపై బుధవారం ఉదయం కత్తితో దాడి చేసాడు. స్థానికుల కథనం మేరకు...భార్యాభర్తల చేతులపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన గ్రామస్తులు బాధితులను నర్సీపట్నం ఏరియా హాస్పటల్‌కి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం సిర్లపాలెంలో బుధవారం నిప్పు అంటుకొని గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో తాళ్లవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన టి.వెంకట్రావు, కె.సురేష్, ఆర్.శంకరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.



టీకాలు వేస్తున్న పశువైద్య అధికారులు

మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి -అనంతగిరి: పొలం పిలుస్తుంది కార్యక్ర మంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పశువులు, గొర్రెలు మేక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని పశువైద్యాధికారి సాగరి గణేష్శ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాశీపట్నం పంచాయతీ బంగారమ్మ పేట, సారవనిపాలేంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులపై కోతుల దాడి

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలలో కోతులు దాడి చేయడంతో పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం బొర్రా గుహల్లో కోతులు ఓ బాలుడిపై దాడి చేసింది. దీంతో పర్యాటకులు భయాందోళన వ్యక్తం చేశారునిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే బొర్రా గుహల్లో కోతులు విపరీతంగా పెరిగి పోవడంతో భయాందోళన చెందుతున్నారు ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు స్పందించి కోతులను అరికట్టాలని కోరారు.

నిరాశ్రయులకు ఆనంద మార్గ వితరణ

ప్రజాశక్తి - అరిలోవ : ఆరిలోవ సెక్టర్-5 సమీపంలో ఉన్న జై భీమ్‌నగర్‌లో నిలువ నీడలేని అతి నిరుపేదలకు పాత డెయిరీ ఫారం వద్ద ఉన్న ఆనంద్ మార్గ యూనివర్సల్ రిలీఫ్ టీం బియ్యం, దుప్పట్లు తువ్వాళ్లను బుధవారం సాయంత్రం అందజేసింది. ఆనంద్ మార్గ విశాఖ జిల్లా యూనిట్ ఆచార్య సౌమ్యానంద అవధూత, ఆస్ట్రేలియా ఆనంద మార్గ విభాగం ఇంచార్జ్ సుధాత్మ ఆనంద్ అవధూత, ఆచార్య త్రిలోకేసానందావదూత, సంస్థ సభ్యుడు ఆర్ఎ పాత్ర 20 కుటుంబాలకు సహాయం అందజేశారు. ఆనంద మార్గ అందించిన చేయూతకు పేదలు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సిఐ సన్యాసినాయుడు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గంజాయి సాగు, రవాణా, తీసుకోవడం చట్టరీత్యా నేరమని స్థానిక సీఐ ఎన్ సన్యాసినాయుడు హెచ్చరించారు. బుధవారం అల్లూరు ఎస్పి అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు, రంపచోడవరం ఎఎస్‌పి జగదీశ్ హడహళ్లి పర్యవేక్షణలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఐ ఎన్ సన్యాసినాయుడు, ఎస్ఐ ఇ.నరసింహమూర్తి గంజాయి నిర్మూలనపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంజాయి వల్ల ఎన్నో దుష్ప్రరిణామాలు ఉన్నాయని, దాని జోలికి పోవద్దని హితవు పలికారు. గంజాయికి సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా గంజాయి నివారణ విభాగం మొబైల్ నెంబర్ 93811 23100కు గానీ, రాజవొమ్మంగి ఎస్ఐ 94409 00765, సీఐ 94409 00764 నెంబర్లకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. కాలేజీలో ఈవ్‌టిజింగ్‌కు పాల్పడినా, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడినా కఠినచర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గంజాయి జోలికి పోబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

మారేడుమిల్లి: గంజాయి అనర్థాలు, రోడ్డు భద్రత, ర్యాగింగ్ పర్యావసానాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొందరు వ్యాపారుల ప్రలోభాలకు లొంగి గిరిజన యువత, విద్యార్థులు అక్రమ రవాణాలో భాగస్వాములై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులంతా గ్రామాలకు వెళ్లినపుడు అక్కడ కుటుంబసభ్యులకు, ప్రజలకు గంజాయి అనర్థాలపై సామాజిక బాధ్యతగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు, ర్యాష్ డ్రైవింగ్ వల్ల కలిగే నష్టాలు, ర్యాగింగ్‌తో ఇబ్బందులపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానికలేనోరా కాలేజీలో సిఐ ఆర్‌జె.రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ మోహన్‌కుమార్ గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి దుష్ప్రరిణామాలను వివరించారు. యువత మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు.

చింతపల్లి : గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగం వంటి వాటిలో పాల్గొని యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నవరం ఎస్సైలు వీరబాబు, రమణలు సూచించారు. అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతుగెడ్డ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం గంజాయి వాడకం, సాగు, రవాణా తదితర వాటితో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంజాయి సాగు, రవాణాతో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థి దశలో మంచిగా చదువుకొని ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రణాళికలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి కారం లక్ష్మి, తదితరులు

రామవరంలో 'స్వచ్ఛతా హీ సేవా'

ప్రజాశక్తి-విఆర్ పురం: రామవరం పంచాయతీలో ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ, గ్రామ సెక్రెటరీ తాతారావు ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు, మురుగుకాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ వచ్చేనెల ఒకటి వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పారిశుధ్యం క్షీణిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సూచించారు. పంట పొలాల్లో ప్లాస్టిక్ బాటిల్స్‌ను పడేయవద్దని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్లాది రమేష్, ఉప సర్పంచ్, పారిశుధ్యకార్మికులు, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - 2047పై సమీక్ష

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిఎలు, ఇఎలు, గహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ, స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా గ్రామాల్లో స్వచ్ఛతా హిసేవ, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతోపాటు గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రజల్లో అవగాహనకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

పర్యాటక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: ఏజెన్సీ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకాభివృద్ధిలో భాగంగా పర్యాటక ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, పర్యాటకులకు అవగాహనకు లోకల్ గైడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మారేడుమిల్లి జలతరంగణి వద్ద గైడ్‌ల సహకారం, సూచనలు లేనందువల్లే ఇటీవల ఏలూరుకు చెందిన మెడికోలు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. జల తరంగిణి వద్ద ఎకో టూరిజం పేరుతో ఫారెస్ట్ అధికారులు ఒక్కొక్కరి నుంచి రూ.50 టికెట్ వసూలు చేస్తున్నారు తప్ప, కనీస సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి పెట్టాలని కోరారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి -మారేడుమిల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మారేడుమిల్లి నీల్ ఆర్మ్‌సాంగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.11,175 విరాళాలు సేకరించారు. పాఠశాల యాజమాన్యం ప్రోద్బలంతో విద్యార్థులు సేకరించిన విరాళాలను ఎంపిడిఒ వీరకిషోర్‌కు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గడుతూరు రవికుమార్, హెచ్ఎం ఎ.నీలయ్య, ఉపాధ్యాయులు ఎస్ అనిల్‌కుమార్, టి గణేష్, కె ధర్మారెడ్డి, విద్యార్థులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వీరకిషోర్ మాట్లాడుతుఊ, విద్యార్థుల సేవాభావం, సామాజిక దృక్పథాన్ని అభినందించారు.

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయనగరంలో నవంబర్ 27 నుండి 30వ తారీకు వరకు జరుగనున్న ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి రంపచోడవరం : మారేడుమిల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సున్నంపాడు 11కెవి ఫీడర్‌లో విద్యుత్‌లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు వంటి పనుల దృష్ట్యా ఈ నెల27న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఇఇ మహ్మద్ యూసఫ్ తెలిపారు. రంప నుండి మద్దివీడు వరకు బొర్నగూడెం నుండి దేవిపట్నం వరకు అలాగే దేవిపట్నం మండలం గెద్దాడ నుండి అకూరు వరకు, మారేడుమిల్లి మండలం పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు!

ప్రజాశక్తి -మారేడుమిల్లి : ఇటీవల భారీ వర్షాల కారణంగా పర్యాటకుల భద్రత దృష్ట్యా మండలంలోని పుల్లంగి పంచాయతీలో ఉన్న గుడిసె గ్రాస్‌ల్యాండ్ టూరిజం నిలుపుదల చేస్తూ పాడేరు జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆదేశాల జారీ చేశారు. అయితే వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ, అటవీశాఖ అధికారులు ఆకుమామిడి కోట వద్ద చెక్‌పోస్ట్ పెట్టి పర్యాటకుల వద్దఅక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ పర్యాటకులను అనుమతిస్తున్నారని పుల్లంగి పంచాయతీ సర్పంచ్ వి. జార్జిబాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. దీనిపై కలెక్టర్ చొరవ చూపి, దర్యాప్తు నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

కేన్సర్ బాధితునికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అడ్డతీగల : మండలంలోని వీరభద్రపురం గ్రామంలో పందిరి గవర్ రాజు కుమారుడు పందిరి అభిషేక్‌సాగర్ రెండేళ్లుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ,విజయ భాస్కర్ ఆర్థికసాయం అందజేశారు. ఉచిత అంబులెన్స్‌లో తన సొంత ఖర్చులతో గుంటూరు కేన్సర్ హాస్పిటల్‌కు తరలించడంతో పాటు వైద్యానికి ఆర్థికసాయం అందించారు. తెలుగుదేశం సీనియర్ నాయకులు బుర్లె హరిబాబు, ఎడ్ల శ్రీనివాస్, వీరారెడ్డి ,రాజేశ్వర్ రావు వీరబాబు, అడ్డతీగల మండలం జనసేన నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి రాజవొమ్మంగి మండలం అధ్యక్షులు జనసేనబొదిరెడ్డి త్రిమూర్తులు , ఉపాధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ డిడిగా కొండలరావు

ప్రజాశక్తి రంపచోడవరం : రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా ఐ.కొండలరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులకు న్యాణ్యమైన విద్య, వైద్యం, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

విఆర్.పురంలో చెకుముకి టాలెంట్ టెస్ట్



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షలో భాగంగా వి.ఆర్.పురం మండల కేంద్రంలోని జెడ్‌పి హైస్కూల్‌లో 8,9,10వ విద్యార్థులకు హెచ్ఎం.చిచ్చడి.బాబూరావు ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష లో 74 మంది విద్యార్థులు పాల్గొన్నారి ఇన్విజిలేటర్‌గా కె.రాము, జి.శ్రావణి, కె.ప్రసాద్, ఎన్.అనిల్, డి సత్యనారాయణ వ్యవహరించారు. చెకుముకి పరీక్ష విజయవంతానికి సహకరించిన హెచ్ఎం ఇతర ఉపాధ్యాయులకు యుటిఎఫ్, జనవిజ్ఞాన వేదిక తరపున కృతజ్ఞతలు తెలిపారు.

శబరి వంతెనపై విద్యుద్దీపాల ఏర్పాటు

ఆయుర్వేద వైద్యులు జమాన్‌ఖాన్ సేవాభావంపై ప్రశంసలు

ప్రజాశక్తి-చింతూరు : తన సొంత నిధులు రూ.1.50లక్షలతో శబరినది వంతెనపై ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలను ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్ బుధవారం ప్రారంభించారు. శబరి నదిపై వారధి నిర్మించి 51ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు విద్యుత్ లైట్లు లేక అంధకారంలోనే ఉంది. తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి. ఇన్నాళ్లుగా ప్రభుత్వం, నాయకులెవరూ పట్టించుకోని నేపథ్యంలో ఇటీవల వరదల సమయంలో స్థానికులు సమస్యను ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ దృష్టికి తేగా, వెంటనే స్పందించి తన జెకెసి ట్రస్ట్ ఆధ్వర్యంలో శబరివంతెనపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని ప్రారంభించారు. డాక్టర్ జమాల్‌ఖాన్ ఔదార్యం, సేవాభావాన్ని పలువురు కొనియాడారు.కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్,టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, శ్రీరామ్, సురేష్ చౌదరి, పొదిలి రామారావు, సీలం తమ్మయ్య, జనసేన నాయకులు మడివి రాజు. పయ్యావుల నాగేశ్వరరావు, ఓబులనేని నరసింహారావు, బేడి సతీష్ పాల్గొన్నారు



కార్యక్రమంలో పాల్గొన్న జమాల్‌ఖాన్ తదితరులు



మొక్కలు నాటుతున్న తాతబ్బాయి దొర

పాఠశాల ఆవరణలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి -మారేడుమిల్లి: వై రామవరం మండలం గుర్తేడు ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మారేడుమిల్లి, వై రామవరం మండలాల విద్యాశాఖాధికారి కె తాతబ్బాయి దొర ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చదువు, ఆటలతోపాటు సామాజిక దృక్పథం కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. బాగా చదువుకుని భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మణరావు దొర, ఉపాధ్యాయులు లండా లక్ష్మయ్య, గోము కృష్ణ, సిఆర్‌పి జి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

పుల్లంగిలో 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభ

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మండలం పుల్లంగి పంచాయతీ పరిధిలోని పీడమర్రి, ఎగవలస, గ్రామాల్లో సర్పంచ్ వి జార్జిబాబు ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి జన్‌మన్, ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజులు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, అమలు చేసిన హామీలను వివరించారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తేవాలని, అధికారులకు విన్నవించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వెటర్నరీ గాంధీ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధింపు

ప్రజాశక్తి -కొయ్యూరు : సచివాలయ వ్యవస్థపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని స్థానిక ఎంపిపి బడుగు రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పాలనలో ఉపాధ్యాయ పోస్టులు తప్ప మరి ఇతర శాఖలఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. , కానీ జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని శాఖలకు ప్రాధాన్యత కల్పిస్తూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థను నెలకొల్పి, ఒకేసారి ఒక లక్ష 30 వేల పోస్టులు భర్తీ చేసి, నిరుద్యోగులకు వరంగా మారారన్నారు. జగన్ ప్రభుత్వంలో వాలంటీర్లతో ఇంటింటికి స్టికర్లు అంటిస్తేకోర్టులను ఆశ్రయించిన అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఇప్పుడు ఏకంగా సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికి స్టిక్కర్లు అంటింపజేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తమకు ప్రమోషన్లతో ఉన్నత స్థానాన్ని అందిస్తుందని భావించిన సచివాలయ ఉద్యోగులు ఇపుడు కక్షసాధింపు చర్యలతో ఆవేదన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులను పక్కన పెట్టి, సచివాలయ ఉద్యోగులను ఉద్యోగులుగా గుర్తించాలని, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఎంపిపి రమేష్ కోరారు. లేదంటే తగు మూల్యం చెల్లించుకోక తప్పదనిహెచ్చరించారు.

ఆసుపత్రి ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి - కొయ్యూరు : ఇంట్లో డెలివరీ కంటే ఆసుపత్రి ప్రసవాలు తల్లీబిడ్డల ఆరోగ్యానికి శ్రేయస్కరమని సిడిపిఒ విజయకుమారి సూచించారు. ఈమేరకు అంగన్వాడీ, ఆశా వర్కర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం కొయ్యూరు సెక్టార్ పరిధిలోని బాలరేవుల అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రసవ సమయానికి ముందుగానే ఆసుపత్రికి వెళ్లి, ఆసుపత్రిలోనే ప్రసవించాలని గర్భిణులకు సూచించారు. ఏడుగురు గర్భిణులకు సీమంతం జరిపించారు. గర్భిణులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.